# ఏకంకండి



''సార్ రెండు రెళ్ళెంతండి?''

'అదికూడా తెలియదా? పందొమ్మిది రెండ్లా మైనస్ పది హేడు రెండ్లు''

''అంటే ఎంత?''

''వంద మైనస్ పదహారు ఆర్లు''

''అంటే?''

ఫూల్! ఆమాత్రం తెలియదా?

*** *** ***

''గురువుగారూ! రెండు రెళ్ళెంతండి?''

''నాలుగు శిష్యా''

''నాలుగనే ఎందుకనాలండి! అయిదనవచ్చుగా?''

''వచ్చు''

మూడనకూడ దాండీ?''

''అలాకూడా అనవచ్చు. అంకెలు కనుక్కున్న వాడు అలా అని వుంటే యిప్పుడు మనమూ అలాగే అనేవాళ్ళం''

'అయితే... ప్రపంచమంతా రెండు రెళ్ళు నాలుగే నాండీ?''

''అవును''

''మనదేశంలో కూడానాండీ?''

''ఏం? మన దేశం ప్రపంచంలో భాగంకాదా?''

''అవుననుకోండి! మరి...''

''ఏమిటోయ్ నీ చొప్పదంటు ప్రశ్నలు?''

''కోప్పడుతున్నారు గురూజీ!''

''సర్లే! నీ ధర్మ సందేహం బయటపెట్టు''

''మీరు కమ్యూనిస్టు కదండీ?''

''అవును! ఫలానా'యిస్టు'ని''

''కమ్యూనిజం అంటే ప్రపంచమంతా ఒకటే అర్థం కదండీ?''

''ఔను!''

''ఇండియాలో కూడానాండీ?''

''మళ్ళీ వెధవప్రశ్న! ఇండియా ప్రపంచంలో భాగమని ఇంతకు ముందే ఒప్పుకున్నావుగా!''

''అవుననుకోండి! మరి...''

''నస పెట్టకు. మళ్ళీఏమొచ్చింది...అనుమానం?''

''తిట్టనంటే అడుగుతాను''

''మధ్యలో ఈ క్లాజు ఎందుకు''

''సమాధానం చెప్పలేని ప్రశ్న వేస్తే తిట్టటమేగా మనకు తెలిసిన విద్య, అందుకు!''

''ఏడిశావ్‌లే! అఘోరించు''

''అదుగో తిడుతున్నారు''

''నీ ప్రశ్నేమిటో కక్కవోయ్''

''ప్రపంచమంతా రెండు రెండ్లు నాలుగే అయినట్లు కమ్యూనిజమంటే కూడా ఒకే అర్థం అన్నారు కదా?''

''నిజం ఎప్పుడూ నిజమే! పేచీ ఏముంది?''

''మరి మన దేశంలో బోలెడు పేర్లతో, బోలెడు గుర్తులతో బోల్డు ఎర్రజెండాలు ఎగరేస్తారెందుకు గుర్జూజీ?''

''అదేనోయ్ భారతీయత. 'దేవుడొక్కడే' అంటూనే ముక్కోటి దేవతల్ని పూజిస్తున్న విశాల హృదయం మనది! గమ్యం ప్రధానంకానీ... మార్గం కాదు!''

''జనం గందరగోళపడరూ?''

''అదాలోచించాల్సింది మనం మాత్రమే కాదు, నాయకులు కూడా''

''మరి ఈ సమస్య ఎప్పటికి తీరేట్లు?''

''అందరూ ఒక నినాదాన్ని నిజాయితీగా అనుసరిస్తే తప్పకుండా తీరుతుంది.''

''ఏమిటది?''

''నాదేశ కమ్యూనిస్టు లారా ఏకంకండి!''

''ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదానికిది కాపీ అంటారేమో!''

''అమాయకుడా మంచి ఎప్పుడూ జనానికే అంకితం! కాబట్టి కాపీ రైటుంటుంది''

''ఈ నినాదాన్ని త్రికరణశుద్ధిగా ఆచరిస్తారంటారా?''

''అనుమానమే. మనది భారతదేశం కదూ! అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలిగా!''

''అయితే ఈ నినాదం అట్టలమీద రాసేస్తామ గురువుగారూ''

''అట్టలు అంటున్నావ్, ఎన్నేమిటి?''

''రెండు''

''ఒకటి చాలు''

''మనం ఇద్దరమున్నాంగా''

''మన కొత్త ఉద్యమానికి నేనే నాయకుణ్ణి. నాయకుడు అట్టలు పట్టుకుని నినాదాలివ్వటం హుందాగా ఉండదు.''

''సెలవ్, మనకిన్ని ఎర్రజెండాలెందుకున్నాయ్యో ఇప్పుడర్థమైంది గురువుగారూ, వస్తా!''

''నీ బొంద, ఏమిటి నీకర్థమైంది? పందొమ్మిదొందల పదిహేడులో రష్యా విప్లవ విజయానికి ముందు లెనిన్ ఏమన్నాడంటే...''

''నేను 1946నుంచి ఇంటిలో జరుగుతున్న దాని గురించి అడుగతున్నాను బాబోయ్!''

''1946 నాటికి నువ్వు పుట్టనేలేదు, అసలు నీ వయసెంత?''

''1917 నాటికి మీరు పుట్టారా? అప్పటికి మీ వయస్సెంత?''

''ఇడియట్! నన్నే ఎదిరిస్తావా? నిన్ను మన సమైక్యతా నినాద ఉద్యమంనుంచి బహిష్కరిస్తున్నా. గెటౌట్!''

''ఇప్పుడు పూర్తిగా అర్థమైంది గురువుగారూ! గుడ్‌బై''

*** *** ***

అదండీ సంగతి!

నిజాన్ని మరిచిన ఏ యిజమైనా ప్రజకు దూరమవుతుందన్న నిజం ఫలానా ఫలానా 'యిస్టులు' ఎప్పుడు తెలుసుకుంటారో అప్పుడే జనాన్ని నడిపి, వాళ్ళ భవిష్యత్ దిద్దగలుగుతారు. గడ్డిపోచలు మదపుటేనుగును బంధిస్తాయని మరచి, ఎవరి కుంపటి వాళ్ళు పెట్టుకుంటే పొగపెట్టి, బూడిద పోగెయ్యటం తప్ప జనాన్ని పోగెయ్యటం మాత్రం ఉండదు.

అందుకే——

నా దేశ ఫలానా ఫలానా కమ్యూనిస్టులారా! ముందు మీరు ఏకంకండి!

డా॥ శాంతికుమార్